ప్రజాశక్తి
మంగళవారం 11 మార్చి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పిసిపిఐఆర్ కదలిక

- కాకినాడ-విశాఖ తీరంలో మళ్లీ పెట్రో విష రసాయన పరిశ్రమల ముప్పు తప్పదా?
- ఎస్‌డిఎ రద్దు... యుడిఎ అమలు...
- రాగల 8 నెలల కాలంలో మాస్టర్ ప్లాన్‌కు సన్నాహాలు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం -కాకినాడ పెట్రో కెమికల్, పెట్రోలియం ఇన్వెస్ట్‌మెంట్ (వికెపిసిపిఐఆర్) రీజియన్ ప్రత్యేక అభివృద్ధి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రద్దు చేస్తూ దీని స్థానంలో విశాఖపట్నం కాకినాడ పెట్రోకెమికల్, పెట్రోలియం ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (వికెపిసిపిఐఆర్‌యుడిఎ)ను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తానికి ఏ రాయి అయితేనేమీ పల్లూడగొట్టుకోడానికి అన్నట్టు.. పెట్రో రసాయనాల పరిశ్రమలతో సముద్ర తీరం విషతుల్యం అయ్యే పరిస్థితులు మళ్లీ నెలకొనబోతున్నాయన్నది స్పష్టమవుతోంది. ఈ పిసిపిఐఆర్ లక్ష్యం పెట్టుబడులను సముద్ర తీర ప్రాంతంలో ఆకర్షించడం ఆహ్వానించడం. ఈ మేరకు ఫార్మా ఇండస్ట్రీస్ పెద్ద ఎత్తున కాకినాడ నుంచి విశాఖపట్నం వరకూ వరదలా వచ్చిపడతాయన్న భయాందోళనలు తీర ప్రాంత ప్రజానీకాన్ని ఎప్పటి నుంచో గురిచేస్తున్న అంశం. కాగా తాజాగా కూటమి ప్రభుత్వం పిసిపిఐఆర్ విషయంలో ఫైళ్లను నెమ్మదిగా కదుపుతోంది. కాకినాడ నుంచి విశాఖపట్నం వరకూ తీర ప్రాంతాన్ని వ్యూహాత్మక పెట్టుబడుల కేంద్రంగా మార్చే దిశగా చేస్తున్న ప్రయత్నాలపై సిపిఎం, వామపక్షాలు పోరాడుతూనే ఉన్నాయి. మత్స్య సంపదకు తీవ్ర విఘాతం కలిగి మత్స్యకారులంతా సముద్రం నుంచి వెడలిపోయే ప్రమాదం దాపురిస్తుందన్నది వారి వాదనగా ఉంది. ఇప్పటికే తీర ప్రాంతం అంతా ఫార్మా హబ్‌గా మారిపోవడమే ఇందుకు కారణం. వాస్తవానికి 2012లో ఈ ప్రాంతంలోని పాదయాత్రలో చంద్రబాబు పిసిపిఐఆర్‌కు తాను వ్యతిరేకంగా పోరాడతానని రైతులకు హామీ ఇచ్చారు. భూములు తీసుకోడానికి అధికారులొస్తే గట్టిగా బుద్ధి చెప్పండంటూ చెప్పిన సందర్భాలూ ఉన్నాయి. విశాఖ-తూర్పుగోదావరి జిల్లాల్లోగల 10 మండలాల్లో సుమారు 110 గ్రామాల్లో ఈ పిసిపిఐఆర్‌కు భూములు సేకరించేందుకు తాజాగా కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 2014-2019 మధ్య దీనికోసం చంద్రబాబు చొరవ చేయబోతే ప్రజా నిరసనలను ఎదుర్కొన్నారు. తాజాగా అదే పాట పాడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంది

గతంలో ప్రత్యేక అభివృద్ధి సంస్థ (ఎస్‌డిఎ) పరిధిలో 10 మండలాల్లో గల 110 రెవెన్యూ గ్రామాల్లో ప్రణాళికా బద్ధ అభివృద్ధి నిమిత్తం 2014లో ఆమోదింపబడ్డ మాస్టర్ ప్లాన్‌కు 204 అభ్యంతరాలను సాంకేతిక నిపుణుల కమిటీకి సమర్పించారు. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకున్నాక జీవో 121ను కూటమి ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీని ఏర్పాటు చేసింది. విశాఖపట్నం కాకినాడ పెట్రో కెమికల్ పెట్రోలియం ఇన్వెస్ట్‌మెంట్

మిగతా 2లో..

గోవాడ రైతు సమస్యలపై పోరాటం

- గోవాడ, తాడి ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

చెరుకు యార్డులో రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

గోవాడ సుగర్ రైతులకు బిల్లులు, కార్మికులకు బకాయి జీతాలు చెల్లించేలా పోరాటం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా చోడవరంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ, పరవాడ మండలం తాడిలో సోమవారం జరిగిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. చెరకు యార్డులో రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మరమ్మతు సమయంలో వృథాగా చెరకు రసం బయటకు పోతున్న మదుములను పరిశీలించారు. అక్కడ నుంచి సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డిని కలిసి ఫ్యాక్టరీ పరిస్థితి తెలుసుకున్నారు. రైతులు, కార్మికుల బకాయిలు చెల్లించాలని ఎమ్‌డిని కోరారు. అక్కడి నుంచి కాలుష్య ప్రభావిత తాడి గ్రామం వెళ్లారు. మహిళలతో మాట్లాడారు. ప్రజలు వినియోగిస్తున్న నీటిని పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కండేపల్లి పైడమ్మను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఊరికి అనుకొనివున్న పరిశ్రమలను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలకులు గెలిపించిన ప్రజలను ఆదుకోకుండా మోసం చేయడం నమ్మకద్రోహమన్నారు. రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఎమ్మెల్యేలు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. విదేశాలు, ప్రధాని మోడీ రాష్ట్రం గుజరాత్‌లో వద్దనుకున్న ఫార్మా కంపెనీలను ఈ ప్రాంతంలో పెట్టి ప్రజల బతుకులు నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, బతుకు పెట్టే సుగర్ ఫ్యాక్టరీని ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించకపోతే ఎలా బతుకుతారన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాస రావు, జి.వరలక్ష్మి, దొర, దేముడునాయుడు, నర్సింహ మూర్తి, నాయకులు కర్రి అప్పారావు, నాయనిబాబు, సాంబశివరావు, నాయుడుబాబు పాల్గొన్నారు.

తాడిలో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఇంటర్ పరీక్ష హాల్లో ఇన్విజిలేటర్ మృతి

వార్త మెయిన్‌లో..

'గోవాడ'పై కూటమి వాగ్దానాలు ఏమయ్యాయి? ఎమ్మెల్సీ బొత్స

వార్త మెయిన్‌లో..

విమ్స్ వైద్యుల అరుదైన ఘనత
విజయవంతంగా కాలేయ మార్పిడి ఆపరేషన్

వార్త 3లో..

జివిఎంసి కమిషనర్‌ను నియమించాలి

సిపిఎం, సిపిఐ కార్పొరేటర్ల ధర్నా

ధర్నా చేస్తున్న స్టాలిన్, గంగరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండు నెలలుగా కమిషనర్‌ను నియమించకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ సోమవారం జివిఎంసి ప్రధాన ప్రవేశ మార్గం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ, సుమారు 700 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దాదాపు 30 లక్షల మంది ఫ్లోటింగ్ పాపులేషన్‌తో ఉన్న విశాఖ నగరానికి జిల్లా కలెక్టర్‌ను ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ప్రభుత్వాలతో నిమిత్తం లేకుండా ప్రతి ఆరు నెలలకు ఒకసారి కమిషనర్‌ను మార్చడం పరిపాటిగా మారిందని విమర్శించారు. సంపత్ కుమార్‌ను కూటమి ప్రభుత్వమే కమిషనర్‌గా నియమించి కేవలం 5 నెలల కాలంలో అమరావతికి బదిలీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల కష్టాలు తెలుసుకొని వారికి అండగా ఉండి పనిచేసే కమిషనర్లు అంటే ఈ ప్రభుత్వానికి గిట్టదా అని అడిగారు. జనవరిలో కార్పొరేషన్ బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండగా, మార్చి నెల వచ్చినా దాన్ని పట్టించుకునే నాథుడే లేడని, దీనివల్ల జీతాలు చెల్లింపులు ఆగిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. 98 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీరు, పారిశుధ్యం వంటి అనేక సమస్యలను గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పనిచేసే ఐఎఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్"లో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ ఎస్ఎస్.వర్మ వినతులు స్వీకరించారు.

అర్జీదారులకు బిస్కెట్లు, టీ, మంచినీరు

కలెక్టరేట్‌లో నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులకు సరికొత్త అనుభూతి కలిగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అర్జీదారులకు బిస్కెట్లు, టీ, మంచినీరు సిబ్బంది స్వయంగా అందజేశారు.

అధికారులతో సమీక్ష సమావేశం...

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో రీ-ఓపెన్ అర్జీలు తరచుగా రావడం పట్ల అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీపం పథకం అమలు, లబ్ధిదారుల ఖాతాలకు సబ్సిడీ అందుతున్నది లేనిది గమనించాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కెజిహెచ్‌లో రోగులకు అవసరమైన పరీక్షలను నిర్వహించి, మందులు పంపిణీచేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఇసుక లభ్యత వినియోగంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పి4 సర్వేపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. పి4 సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 332 వినతులు అందాయి.

మొదటి పేజీ తరువాయి..

పిసిపిఐఆర్ కదలిక

రీజియన్ అభివృద్ధి సంస్థ (యుడిఎ) ఏర్పాటు చేయడం ద్వారా మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ముందుకు సాగుతోంది. ఈ మేరకు గతంలో మెమో 9607/ఎం1 2021 ప్రణాళిక ప్రకారం అప్పట్లో ఎల్ఇఎ అనే అసోసియేట్స్‌తో జరిపిన చర్చల అనంతరం మాస్టర్ ప్లాన్ రూపొందించారు. దీన్ని తాజాగా మరింత అభివృద్ధి పరిచేందుకు గానూ ఏపి మెట్రోపాలిటన్ రీజియన్ అభివృద్ధి సంస్థల చట్ట పరిధికిలోబడి 8 నెలల కాల వ్యవధికి గానూ రూ.1.75కోట్లు (జిఎస్‌టి మినహాయించి) కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం మేరకు తదుపరి పనులు ముందుకు వెళ్లనున్నాయి. ఈ వికెపిసిఐఆర్ యుడిఎ పరిధిలో ముఖ్యమయిన ప్రాంతాల్లో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించడం అత్యంత కీలకం కానుంది. మాస్టర్ ప్లాన్‌ను ఈ సమావేశాల అనంతరం 8 నెలల తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రంగం సిద్ధం అవుతోంది. ఆ తర్వాతే పిసిపిఐఆర్ యుడిఎ ముసాయిదా నివేదికను ప్రభుత్వానికి అమోదానికి పంపాలని విఎంఆర్‌డిఎ అధికారులు తాజాగా భావిస్తున్నారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయంటూ ప్రభుత్వం పాత పాటే అందుకోవడం విశేషం.

'ఎన్‌టిఆర్ కృషితోనే మహిళల అభివృద్ధి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు కృషితోనే రాష్ట్రంలో మహిళలు అభివృద్ధి చెందారని, తర్వాత మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడే విధంగా చంద్రబాబు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేశారని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలు ద్వారా10 వేల మందికి జీవనోపాధి కల్పించారన్నారు. చేనేత రంగంలో మహిళలకు చేయూత ఇచ్చేలా మార్కెటింగ్ సౌకర్య కల్పనకు జిల్లాకు రూ. 60 లక్షలు కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో లక్షా 50 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నారన్నారు. అర్బన్ క్లాప్, ర్యాపిడోలో ఉపాధి పొందేలా మహిళలకు ఉచితంగా ద్విచక్ర వాహనాలు అందించారని తెలిపారు. సమావేశంలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పట్టాభి, కోరాడ శంకర్రావు, కేదారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్ నర్సింగ్ విద్యార్థులకు క్రైమ్ అవేర్‌నెస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జి హాస్పిటల్‌లో నర్సింగ్ విద్యార్థులకు సోమవారం క్రైమ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. విద్యార్థులకు భద్రత, చట్టపరమైన అంశాలపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జిడి.బాబు అవగాహన కల్పించారు. ఆన్లైన్ మోసాలు, సైబర్ వేధింపుల గురించి అవగాహన కల్పించి, ఏవైనా అనుమానాస్పదమైన సంఘటనలు ఎదురైతే పోలీసులకు తెలియ జేయాలన్నారు. శారీరక హక్కులు, రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తక్షణమే తల్లి దండ్రులు, గురువులు, పోలీసులకు సమాచారం అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు అధికారులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖలో 'నాట్స్' స్వచ్ఛంద సేవ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ (నాట్స్) సభ్యులు, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ సెక్రటరీ వెంకన్న చౌదరి యార్లగడ్డ ఆధ్వర్యాన నగరంలో సోమవారం పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెదవాల్తేరులోని విభిన్న అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక సేవలు అందిస్తున్న లిటిల్ ఫ్లవర్స్ స్కూలుకు నాట్స్, ఎవల్యూట్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడు శ్రీని అరసాడ సంయుక్తంగా రూ. 20 లక్షల చెక్కును స్కూలు బస్సు కొనుగోలు నిమిత్తం అందించారు. ఈ సందర్భంగా నాట్స్ అధ్యక్షులు మదన్ పాములపాటి మాట్లాడుతూ, రెండేళ్లకోసారి తమ సంఘం అమెరికాలోని తెలుగు కుటుంబాలతో వేడుకలు జరుపుకుంటుందని, ఈ వేడుకలకడు వచ్చిన విరాళాలలో 10 శాతం స్వచ్ఛంద కార్యక్రమాలకు వినియోగిస్తుంటామని చెప్పారు. ఈ క్రమంలో 2020-23 సంవత్సరానికి రూ.2.5 కోట్లను స్వచ్ఛంద



లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌కు చెక్కును అందిస్తున్న నాట్స్ సభ్యులు

కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. అందులో రూ.1 కోటి ఆంధ్ర , తెలంగాణలోనూ రూ.1.5 కోట్లను అమెరికాలోని ప్రవాస భారతీయుల అభ్యున్నతికి వినియోగిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, మంచినీటి సౌకర్యం, అంశాలలో వెనుకబడిన ప్రాంతాలకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని మాట్లాడుతూ, భాషే రమ్యం - సేవే గమ్యం అనే నినాదంతో మాతృభూమి రుణం తీర్చుకోవడంలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎవల్యూట్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడు శ్రీని అరసాడ మాట్లాడుతూ, తాను ఎంతోకాలంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులను రానున్న తరాలకు అందించే క్రమంలో ఈ సంస్థకు బస్సు కొనుగోలు నిమిత్తం తాను రూ.10 లక్షల విరాళంగా ఇచ్చానని చెప్పారు.

ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థి తాళ్లూరి పూర్ణచంద్రరావు 432 అల్యూమిని మంచాలు తయారు చేయించి ఎయు హాస్టల్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నాట్స్ కన్వెన్షన్ కన్వీనర్ శ్రీనివాస్ గుత్తికొండ, ప్రెసిడెంట్ ఎలెక్ట్, శ్రీహరి మందడి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ పిడికిటి, సురేష్ బొల్లు పాల్గొన్నారు.

రజకులకు రూ.1000 కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర బడ్జెట్‌లో రజకులకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యాన మేడిశెట్టి రమణ అధ్యక్షతన సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు రజకుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులు సుమారు 50 వేల మంది ఉన్నారన్నారు. రజకులు వృత్తి చేయుటకు దోబీ ఘాట్లు, స్థలాలు, వృత్తి పరికరాలు లేవన్నారు. పక్కా ఇల్లు లేక అద్దె ఇళ్లల్లోనూ, దోబీఘాట్ల వద్ద నివసిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు రజకులకు చంద్రబాబు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. 50 సంవత్సరాలు వయసు పైబడిన రజకులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. లాండ్రిలకు సబ్సిడీ రుణాలు, దోబీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రమణ, నాయకులు ఎస్.గౌరి, కె.శ్రీను, పివి.రమణ, ఎం.రమణ, ఎ.అప్పారావు, జి.గణేష్, కె.పరదేశి, కె.లక్ష్మి, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోర్టుకు డ్రెడ్జింగ్ సబ్సిడీ కల్పించాలి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌కు డ్రెడ్జింగ్ సబ్సిడీ ఇవ్వాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కోరారు. దేశ సముద్ర వాణిజ్య రంగం బలోపేతానికి అవసరమైన మార్పులకు పునరుద్ధరణగా, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ పార్లమెంట్‌లో "బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్లు-2024" గురించి ప్రస్తావించారు. డ్రెడ్జింగ్ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తే, భారీ నౌకలను ఆకర్షించి, ట్రాన్షిప్‌మెంట్ హబ్‌లుగా అభివృద్ధి చేయవచ్చని చెప్పారు.

విశాఖ క్రూయిజ్ టెర్మినల్‌లో ఈ-వీసా సౌకర్యం అవసరం

రూ.100 కోట్లతో అభివృద్ధి చేసిన విశాఖ క్రూయిజ్ టెర్మినల్‌కు ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం ఇతర ప్రధాన పోర్టుల్లో లభ్యమవుతున్న ఈ-వీసా సదుపాయం విశాఖ పోర్టులో లేకపోవడం ఇబ్బందిగా మారిందని, సంబంధిత మంత్రిత్వశాఖతో సమన్వయం చేసి ఈ-వీసా సౌకర్యం అందుబాటులోకి తేవాలని కోరారు.

'భారత వాణిజ్య భవిష్యత్తు మన సముద్ర వాణిజ్య సామర్థ్యాలపై ఆధారపడి ఉంది. రవాణా వ్యయాలను తగ్గించడం, షిప్‌బిల్డింగ్‌ను అభివృద్ధి చేయడం, పోర్టు మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా మన దేశాన్ని గ్లోబల్ షిప్పింగ్ హబ్‌గా తయారుచేయవచ్చు' అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నాలుగున్నర దశాబ్దాల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుంటూ సందడి చేశారు. విశాఖపట్నం 1979, 1981 సంవత్సరాల్లో భారతీయ విద్యాకేంద్రం (బివికె)లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం నగరంలోని ఒక పార్కులో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరు ఎక్కడ ఉన్నా ఏ స్థాయిలో చదువుకున్నా పాఠశాలను మరువరాదని, పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. అందరూ కలిసి భోజనాలు చేసి సందడిగా గడిపారు.

పార్కులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM OS 40/2022

Between :
Karrothu Srinivasa Rao .....Plaintiff
And :
Bugatha Srinu and others ...Defendants

NOTICE

D5 : Chintha Srinubabu S/o Ch.Sanyasi Naidu, R/o Flat No.203, D.No:- 50-53-11-12, Abless Arcade Apartments, North Extention, Seethammadhara, Visakhapatnam - 530013

Please take notice that the above named Plaitiff filed the above suit against you for specific performance of sale agreement and other reliefs and stands posted to 29-4-2025 for your appearance. You are hereby summons to appear before the Honourable Court either in person or through duly instructed advocate on **29-4-2025 at 10-30 AM** in the above court to answer with all material. Failing which the matter will be heard and deter mind in your absence, exparte as per law.

D.N.Murty
P.Dhananjaya Rao
Advocates for Plaintiff,
Vizianagaram,
Cell : 9440711430

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో EP 85/2017 O.S 670/2014

Between :
కటకం సుజాత ....D.Hr
And:
పడాల కొండబాబు వగైరా ....JDrs

NOTICE

JDr 1 : పడాల కొండబాబు, తండ్రి సీతారామ స్వామి, ప్లాట్ నెం.8, సాయి బాలాజీ రెసిడెన్సీ, యన్.జి.ఓ కోలనీ, పోర్టు స్టేడియం దగ్గర, అక్కయ్యపాలెం, విశాఖపట్నం.
JDr 2 : పడాల విద్యావతి, భర్త పడాల కొండబాబు, -
- Rest ditto -

ఇందలి డిక్రీ హోల్డర్ పై కోర్టులో పై నెంబరు అమలు పిటిషన్ ద్వారా మీ వద్ద నుండి రావాల్సిన బాకీ సొమ్ము వసూలు నిమిత్తం మీ యొక్క ఆస్తిని జప్తు చేసి వేలం ద్వారా అమ్మకం చేయుటకు దాఖలు చేసి యున్నారు. మీ యొక్క హాజరు, సంజాయిషీ నిమిత్తం తే 7-4-2025దీన వాయిదా అయి ఉన్నది. మీరు స్వయంగా గానీ, మీ తరుపు లాయరు ద్వారాగాని పై కోర్టు ఎదుట **తే 7-4-2025దీన ఉదయం 10-30 గంటల**కు హాజరై మీ యొక్క సంజాయిషీ, ఆక్షేపణలు దాఖలు చేసుకొనవలెను. లేనిచో వున్న ఆధారాల మేరకు తదుపరి చర్యలు మీపై పరోక్షముగా కోర్టువారు ఆదేశాలు జారీ చేయడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

బై కోర్టు ఆర్డర్
ఎం.కామేశ్వరరావు
డిక్రీ హోల్డర్ తరుపు న్యాయవాది,
ఎస్.కోట, సెల్ : 9441013505

IN THE HONOURABLE COURT OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM-SPECIAL SC/ST POA CUM IV ADDITIONAL DISTRICT JUDGE: VIZIANAGARAM IA /2024 IN M.V.O.P.307/2024

Between:
Routhu Balakrishna .....Petitioner
And:
Bora Someswara Rao and others..Respondents
TO:
Respondent No.2:
Munakala Ramireddy,S/o. not known, Owner of the Auto, R/o.Apanna Colony, Gajuwaka, Visakhapatnam

NOTICE

Please take notice that the above named petitioner filed a MVOP against respondent 2, for recovery of amount from the Respondent 2 issue to notice to the Respondent 2 and for service of summons notice, in the meanwhile as per the Honourable Court Order issue notice to the R.2, and the same stands posted to **25.03.2025** on that day you have to appear before this Honourable court either personally or through an Advocate by **10.30 A.M** along with your documents, failing which the matter will be decided in your absence as per Law.

MAJJI YOGESWARA RAO,
ADVOCATE,
VIZIANAGARAM.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమీషన్, విజయవాడ.
First Appeal No. A/705/2024
(Against order dated 21.08.2024 in C.C.No. 392/2022 on the file of District Consumer Disputes Redressal Commission, Visakhapatnam)

బిట్వీన్ :
1) ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, ఆథరైజ్డ్ సిగ్నేటరీ, ఫ్లాట్.నెం. 101 & 102, ఫస్ట్ ఫ్లోర్, నరసింహ వినయఘర్, 3వ లేన్, డైమండ్ పార్క్ దగ్గర, ద్వారకా నగర్, విశాఖపట్నం.
2) ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, ఎఫ్-39, స్పెన్సెర్స్ ప్లాజా నెం.769, 4వ ఫ్లోర్, ఫేస్-2, అన్నా సాలై, చెన్నై-60002.
...అప్పీలుదారులు/వ్యతిరేక పార్టీలు

మరియు
కొర్లపాటి చరణ్ దీప్, తండ్రి: కొర్లపాటి శ్రీనివాస రావు, హౌస్ నెం. 49-25-3/1, మధురా నగర్, సీతమ్మ పేట, విశాఖపట్నం-530016.
...ప్రతివాది/ఫిర్యాదుదారు

పై నెంబరు అప్పీల్ నందు పైన తెలిపిన ప్రతివాదికి అప్పీల్ నమూన్ల అందజేయు నిమిత్తం ది. 21.03.2025వ తేదీరికి కమిషన్ వారి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.00 ని.లకు పై కమీషన్ వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గానీ హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపు కొనవలయును. లేని యెడల వారి పరోక్ష మందు సదరుపై అప్పీల్ తీర్మానము కాబడునని ఇందు మూలముగా తెలియ చేయుటమైనది.

(కమీషన్ వారి ఉత్తర్వులు ప్రకారము)
వాయిదా తేది: 21.03.2025

ఇట్లు
కునుకు రాజశేఖర్, అప్పీలుదారు తరుపు అడ్వకేట్,
గాంధీ నగర్, విజయవాడ-520003.

IN THE HON'BLE COURT OF PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM E.P. 227/2024 in O.S. 62/2018

Between:
Sri Dokala Hari Babu ... D.Hr/Plaintiff
And:
Sri Mangu Venkata Joga Rao and others ...JDrs/Defendants

NOTICE

To,
J.Dr No.1: Sri Mangu Venkata Joga Rao S/o. late Koneti Rao, Hindu, aged 86 years, R/at D.No.49-8-17/10, SF-1, Simhagiri Towers, Lalitha Nagar, Visakhapatnam.
J.Dr No.7: Sri Gadi Venkata Ratnam, W/o. Ranganadha Rao, Hindu, aged 79 years, R/at D.No.49-8-17/10, SF-1, Simhagiri Towers, Lalitha Nagar, Visakhapatnam.
J.Dr No.8: Smt. Nyapathi Mangamma @ Lakshmi, W/o. Narasimha Swamy, aged 74 years, R/at D.No.49-8-17/10, SF-1, Simhagiri Towers, Lalitha Nagar, Visakhapatnam.

Please take notice that the above named D.Hr/plaintiff has filed the above E.P.227/2024 to execute the sale deed on behalf of J.Drs/Defendants in favour of me in respect of plaint schedule property (EP schedule property) as per the agreement of sale dated 01-02-2016 by the expenses of mine and send the document for registration of said sale deed to the concerned Sub Registrar, Dwarakanagar, Visakhapatnam and deliver the vacant possession of said registered property and the matter stands posted to **28-03-2025** for your appearance either in person or through a Pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence and the Hon'ble Court will further pass the necessary orders.

(By Order of the Hon'ble Court)
MEDISETTY JAGADEESH, Advocate
Visakhapatnam, Cell: 96420 45655.

వివరాలు వెల్లడిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

విమ్స్ వైద్యుల అరుదైన ఘనత

- విజయవంతంగా కాలేయ మార్పిడి ఆపరేషన్
- రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో తొలిసారి క్లిష్టమైన సర్జరీ
- విమ్స్ వైద్య బృందానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రశంస

ప్రజాశక్తి - ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్) వైద్యుల బృందం క్లిష్టతరమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కేవలం కార్పొరేట్ ఆసుపత్రుల్లోనే జరిగే అత్యంత ఖరీదైన అవయవమార్పిడి సర్జరీలను ఆంధ్ర రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలోని వసతులను వినియోగించుకుంటూ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన కాలేయాన్ని, 40 ఏళ్ల వయసు గల వ్యక్తికి విమ్స్ వైద్యులు విజయవంతంగా అమర్చి, సరికొత్త రికార్డును నెలకొల్పారు. ఈనెల 2న న శ్రీకాకుళానికి చెందిన ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కావటంతో, వారి కుటుంబసభ్యుల అంగీకారం మేరకు సేకరించిన కాలేయాన్ని..3న విమ్స్ ఆస్పత్రికి తరలించారు.. ఇప్పటికే జీవన్‌ధార్ పోర్టల్‌లో కాలేయం కోసం నమోదు చేసుకున్న 40 ఏళ్ల వ్యక్తికి ప్రాధాన్యత క్రమాన్ని పాటిస్తూ, పూర్తిగా కాలేయం పాడైపోయిన కాలేయం స్థానే దీన్ని అమర్చి పునరుజ్జీవం అందించారు. విమ్స్ ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, అనస్థీసియా, జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన వైద్యనిపుణులు, సిబ్బంది సమన్వయంతో శస్త్రచికిత్స చేసి కాలేయాన్ని సకాలంలో విజయవంతంగా అమర్చారు. సంక్లిష్టమైన ఆపరేషన్ చేసిన విమ్స్‌వైద్యుల నిరంతర పర్యవేక్షణలో, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సూచనలు అందించిన సేవలతో కాలేయదాత కోలుకున్నాడు.

విమ్స్ వైద్యుల సేవలు భేష్ :
ట్విట్టర్‌లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

అత్యంత కష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన విమ్స్ ఆసుపత్రి వైద్యబృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అభినందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుకు, సమర్థతకు మచ్చుతునకగా నిలిచారని తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా వైద్యుల పనితీరును ప్రశంసించారు. ప్రభుత్వాసుపత్రిలో తొలిసారి ఇటువంటి ఆపరేషన్ నిర్వహించిన వైద్య బృందానికి, పర్యవేక్షించిన జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు..

ప్రత్యేక పరిస్థితుల మధ్య సర్జరీ చేసాం..: విమ్స్ డైరెక్టర్

వైద్యరంగంలో సంక్లిష్టమైన కాలేయం మార్పిడి సర్జరీని ప్రత్యేక శ్రద్ధ, నిరంతర పర్యవేక్షణతో విజయవంతంగా పూర్తిచేశామని విమ్స్ డైరెక్టర్ రాంబాబు అన్నారు. వారం రోజులపాటు వైద్య బృందం పర్యవేక్షణలో అవయవగ్రహీత పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నాడని. సర్జరీను విజయవంతంగా పూర్తి చేసిన విమ్స్ వైద్యుల బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.. ఎపిలో తొలిసారి ప్రభుత్వ ఆసుపత్రిలో కాలేయ మార్పిడి సర్జరీకి ప్రోత్సహించిన ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎంటి. కృష్ణబాబు, డిఎంఇ నరసింహంకు కృతజ్ఞతలు తెలిపారు. జీవన్‌దాన్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు.

ఎన్ఆర్ఐ మహిళ అనుమానాస్పద మృతి కేసులో నిందితునికి రిమాండ్

నేరాలు ఘోరాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మేఘాలయ జరిగిన ఎన్ఆర్ఐ మహిళ అనుమానాస్పద మృతి కేసులో ఆమె సన్నిహితుడు పిల్ల శ్రీధర్‌ను అరెస్టు చేసినట్లు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి.రమణయ్య తెలిపారు. అమెరికాలోని టెక్సాస్ నివాసముండే విశాఖపట్నం, మహారాణిపేట, కృష్ణానగర్‌కు చెందిన ప్రవాస భారతీయుడు పిల్లా శ్రీధర్ అమెరికాలో మెడిసిన్ ఫ్రీ లాన్సర్ అధ్యాపకునిగా పనిచేస్తున్నాఉ. విశాఖపట్నానికి చెందిన ప్రవాస భారతీయురాలు రోజాతో పరిచయం ఏర్పడిందని వివరించారు. నిందితుడు ఫిబ్రవరి 18న విశాఖపట్నం వచ్చి మేఘాలయ హోటల్లో రూమ్ తీసుకొని బస చేసాడని తెలిపారు. మృతురాలు అమెరికా నుండి ఫిబ్రవరి 14న విశాఖపట్నం వచ్చిందని, మార్చి 6వ తేదీన తనను హోటల్‌లో కలవాలని నిందితుడు ఒత్తిడి చేయడంతో ఆమె వచ్చినట్లు వివరించారు. అనంతరం ఆమె బాత్రూంలో హుక్కుకు చున్నీతో ఉరి వేసుకొని మరణించినట్లు తెలిపారు. హోటల్ మేనేజర్ యాంటోనీ డేవిడ్ ఇచ్చిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణలో భాగంగా నిందితుడు శ్రీధర్ ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించాడని నిర్ధారణ కావడంతో ఆదివారం రాత్రి అరెస్టు చేసి, సోమవారం రిమాండ్‌కు పంపారు.

బైక్‌ల చోరీ కేసులో యువకుని అరెస్ట్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆరు బైక్‌లను చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు క్రైమ్ ఎడిసిపి కె.మోహనరావు తెలిపారు. సోమవారం ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విజయవాడకు చెందిన బత్తుల సాయిరాం అనే యువకుడు, గత సెప్టెంబర్‌లో విశాఖకు వచ్చి, బెట్టింగ్‌లో అప్పుల పాలవ్వడంతో బైకులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. టిపిటి కాలనీలో నిర్వహిస్తున్న తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన సాయిరాంను విచారించగా, ఆరుబైక్‌లు చోరీకి పాల్పడినట్లు గుర్తించి, వాటిని రికవరీ చేశారు. ద్వారక, ఫోర్త్ టౌన్, త్రీ టౌన్, పీఎం పాలెం స్టేషన్ పరిధిలో బైక్‌ల చోరీ చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో క్రైమ్ సిఐ చక్రధరరావు ఎస్ఐ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పెందుర్తి : మండలంలోని జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో ఇళ్లస్థలాల పంపిణీలో అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు కోరారు. సోమవారం గల్లా శ్రీనివాసరావు, టిడిపి సర్పంచ్ మడక అప్పలరాజు, టిడిపి నాయకులు చిన్నారావుతో కూడిన కూటమి నేతల బృందం కాలనీలో పర్యటించి, పరిశీలించారు. వైసిపి హయాంలో ఇచ్చిన జగనన్న కాలనీ ఇళ్లపట్టాల్లో గ్రామానికి చెందిన 50 మంది లబ్ధిదారులుంటే, మరో 120మంది బినామీల పేరుతో పట్టాలు చేయించుకున్నారన్నారు.దీనిపై స్థానిక ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - ఆరిలోవ : దారపాలెంలో సర్వే నెంబరు 15/12లో ప్రభుత్వ భూముల రక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ఈ భూముల్లోని 500 గజాల స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమించుకుని, ఐదు ప్లాట్లుగా ఇళ్ల నిర్మాణాలకు సన్నాహాలు చేస్తుండగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ సర్వే నిర్వహించగా, సుమారు 3.07 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టు సర్వేలో తేలిందని చినగదిలి తహసీల్దారు పాల్ కిరణ్ తెలిపారు. ఈ స్థలంలో ఇప్పటికే కొంత మంది నివాసాలు ఏర్పాటు చేసుకోగా, . ఆక్రమిత ప్రభుత్వ స్థలంలో ఎన్ని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు?, ఎంత భూమి ఆక్రమణకు గురైంది తదితర వివరాలతో కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు దృష్ట్యా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఎఇ సురేష్ కుమార్ తెలిపారు పొడుగుపాలెం, చందక ,గొట్టిపల్లివెంకటాపురం, కుసులువాడ తదితర ప్రాంతాలలో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

ప్రజాశక్తి -ములగాడ: 61వ వార్డు మల్కాపురం, జివిఎంసి ఉన్నత పాఠశాలలో 219 మంది పదవ తరగతి విద్యార్థులకు వార్డు టిడిపి అధ్యక్షుడు మజ్జి సోమేష్ సౌజన్యంతో పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు పరీక్షసామగ్రి కిట్‌ను అందజేశారు. విద్యార్థులు బాగా పరీక్షలు రాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. హెచ్ఎం ఎల్. అరుణకుమారి, మల్కాపురం సిఐ, మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, జనసేన నేతచంద్రమౌళి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా పాఠశాలలోని టెన్త్ విద్యార్థినులకు ఎంపిపి కె.రాంబాబు సోమవారం పరీక్ష సామగ్రిని అందజేసి, శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఆందోళన చెందకుండా పరీక్షలు బాగారాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విద్యార్థినుల్లో మనోధైర్యాన్ని నింపారు. పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక కస్తూర్బా విద్యాలయం విద్యార్థులకు వక్షా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకర సురేష్ కుమార్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు పరీక్ష అట్టలు పెన్నులు సామగ్రి అందజేశారు గిడిజాల జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల విద్యార్థులకు

పరీక్ష కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కోరాడ వైకుంఠం ఆర్థికసాయంతో పరీక్ష కిట్‌లను అందజేశారు. మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, ఆనందపురం సిఐ చింతా వాసునాయుడు, కస్తూర్బా ప్రిన్సిపల్ సత్య లావణ్య, ఎస్ఎంసి చైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ చైర్మన్ ఒ.అప్పన్న స్కూల్ కమిటీ చైర్మన్ శశి , మేమూ సైతం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.దేవుడుబాబు, బి .బంగార్రాజు, బమ్మిడి తారక్, షిణగం వెంకట్రావు, ఈశ్వరరావు, కోరాడ అప్పలరమణ ,మీసాల అప్పలరాజు, షిణగం సన్యాసిరావు పాల్గొన్నారు.

ముగిసిన ఇఎస్ఐసి వ్యవస్థాపక పక్షోత్సవం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) ఆధ్వర్యంలో 74వ వ్యవస్థాపక పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని అక్కయ్యపాలెం సబ్ రీజినల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్కాపురం ఇఎస్ఐఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి.రమణమూర్తి పాల్గొన్నారు. సమావేశంలో బెనిఫిట్స్ బ్రాంచ్ అసిస్టెంట్ డైరెక్టర్ వి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, ఇఎస్ఐసి, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ రెండింటి మౌలిక సదుపాయాలపై మాట్లాడారు. గాజువాకలోని యూనిక్ రెఫెరాటెక్ సొల్యూషన్స్ కాంట్రాక్ట్ కార్మికుడు కె.సంజీవరావు కుటుంబ సభ్యులకు నెలకు రూ.18,780 పింఛను, సినాప్టిక్స్‌ల్యాబ్స్ టెక్నీషియన్ వై.శివకాంత్‌రెడ్డికి రూ.11,346 శాశ్వత వికలాంగ నెలవారీ పింఛను

ఇఎస్ఐసి పక్షోత్సవాల్లో మాట్లాడుతున్న రమణమూర్తి

ప్రయోజనాన్ని పంపిణీ చేశారు. సంస్థ ఇన్‌ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కె.సాహూ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్‌ప్రదీప్ బెహరా, ఇఎస్ఐసి స్టాఫ్ యూనియన్ కార్యదర్శి త్రిదేవ్, బ్రాండిక్స్, వరుణ్ మోటార్స్, తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చురుగ్గా చేపడుతున్నామని, సేకరించిన చెత్తతో వర్మీకంపోస్ట్ తయారు చేస్తున్నట్లు ఇఓపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులను ప్రోత్సహిస్తూనే, మరోవైపు దీని అమ్మకందన్నారావుపంచాయితీకి అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రామాలయ ప్రారంభం

ప్రజాశక్తి- పెందుర్తి :మండలంలోని దువ్వపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత కోదండ రామాలయాన్ని సోమవారం ప్రారంభించి, దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టిడిపి నేత బి.అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపిపి ఎం.నాగమణి స్వామిని దర్శించుకున్నారు. అన్నసమారాధన నిర్వహించారు.

నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి-గోపాలపట్నం : నరవ గ్రామంలో అక్రమ క్వారీ గ్రావెల్ తవ్వకాలు ఆపాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై పెద నరవలో నిర్వహించిన గ్రామసభలో 88వ వార్డు జనసేన అధ్యక్షుడు ఒబ్బిన జనార్దన శ్రీకాంత్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా నరవ గ్రామంలో రేయింబవళ్లు ఇష్టానుసారంగా అక్రమ క్వారీల తవ్వకాలతో పర్యావరణం దెబ్బతినడంతోపాటు ప్రభుత్వ భూమిని నష్టపోతున్నామన్నారు. అడ్డగోలు తవ్వకాలతో ఏర్పడిన గోతులతో భవిష్యత్తులో ఆయా భూములు ఎందుకు పనికిరాకుండా పోతాయన్నారు. ప్రభుత్వపరంగా అనుమతులు లేనప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు సైతం తమ అవసరాలకు అక్రమార్కులు సరఫరా చేస్తున్న గ్రావెల్‌ను వేయించుకోవడం ద్వారా అనధికార తవ్వకాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గవర సత్తిబాబు, ఇల్లపు శ్రీను, టిడిపి వార్డు అధ్యక్షులు గంతకోరు శివకుమార్, మాజీ సర్పంచ్ గవర సంజీవరావు, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, జనసేన నాయకులు గల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై ప్రేరణకు 'ప్రయాస్'

ప్రజాశక్తి-మధురవాడ: సైన్స్ విద్యార్థులలో నూతన ఆవిష్కరణలపై అవగాహన, స్ఫూర్తి కలిగించడానికి వీలుగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో 'ప్రయాస్' పేరిట సరికొత్త కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిఎస్.కృష్ణ మాట్లాడుతూ సైన్స్ విద్యార్థులు ప్రతి అంశాన్ని పరిశోధన దృష్టితో చూడాలని, శాస్త్రవేత్తలతో ముఖాముఖిలో చురుకుగా పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వి. జయతీర్థరావు మాట్లాడుతూ హృద్రోగ సమస్యలపై 30ఏళ్లుగా తాము చేస్తున్న పరిశోధనలు వివరించారు. పిడిఇ-3 వాడకంతో హృద్రోగులలో స్టంట్లు వేయవలసిన అవసరం ఉండదన్నారు. దీనికి సంబంధించి జంతువులపై ప్రయోగాలు విజయవంతం కావడంతో, సైడ్ ఎఫెక్ట్‌లపై ప్రస్తుతం క్లినికల్ పరీక్షలు జరుపుతున్నామన్నారు. ప్రాచీన ఆయుర్వేద విజ్ఞానంపై విద్యార్థులు పరిశోధనలు జరిపి సరికొత్త ఔషధాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్

ప్రొఫెసర్ జయతీర్థరావును సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - సీతమ్మధార: రీటెండర్లను కూడా అడ్డుకుని, పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పరిరక్షించుకుందామని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు పద్మనాభ రాజు అన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న దీక్షలు 161వ రోజు సందర్భంగా సోమవారం హాస్పిటల్ రీటెండరింగ్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ, పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల పోరాటంతో గతేడాది సెప్టెంబర్ 24న ఇచ్చిన టెండర్లను రద్దు చేసిన కేంద్రం, మరల రీటెండర్లు ఇవ్వడం దుర్మార్గమని, వీటిని అడ్డుకుందామని పిలుపునిచ్చారు. పోర్టు నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయడంతోపాటు సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. ఎట్టిపరిస్థితుల్లో పిపిపి ద్వారా ప్రయివేటీకరణ చేయాలని చూస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు.

రీటెండరింగ్ పత్రాలు దగ్ధం చేస్తున్న ఆందోళనకారులు

కార్యక్రమంలో డిఎల్‌బి పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు రామారావు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్ రామలింగేశ్వరరావు, రాఘవులు, జెహెచ్.నాయుడు, లక్ష్మణ్, డి.పైడిరాజు, ఎ.ఎల్లారావు, ఇ.రాంబాబు, హెచ్‌ఎంఎస్ నాయకులు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

12న వైసిపి ఫీజు పోరు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమర్, మజ్జి శ్రీను, ధర్మశ్రీ, ఇతర నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: ఈ నెల 12న వైసిపి నిర్వహించే ఫీజు పోరు ఆందోళనను జయప్రదం చేయాలని ఆపార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి చిన్నశ్రీను అన్నారు. సోమవారం గుడిలోవలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆందోళనకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, జగన్ పాలనలో ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేవని, ప్రజలను, లబ్ధిదారులను ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసినప్పుడు అప్పట్లో చేపట్టిన పథకాలను గురించి గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఉండేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు ఎక్కడున్నారో తెలియడం లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ఈనెల 12న నిరసనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదంచేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి గన్ రెడ్డి శ్రీనివాసరావు, అనకాపల్లి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిపి మజ్జి శారదప్రియాంక, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని ముకుందపురం దున్న అబ్రహం చర్చిలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు నూతన అధ్యక్షుడిగా ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా ౧ శాంతిరాజు కార్యదర్శి ఆనందరావు సహాయ కార్యదర్శిగా శ్యాం బాబు కోశాధికారిగా జాన్ మోజెస్ లులను సహాయ కోశాధికారిగా ప్రవీణ్ కుమార్ ఎన్నుకున్నారు. రెండేళ్ల క్రితం ఎన్నుకున్న కమిటీ కాలపరిమితి ముగియడంతో కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు సంఘ లీగల్ అడ్వైజర్ కెపి దేశాయ్, సహాయ అడ్వైజర్లు జంగం జోషి ప్రశాంత్ కుమార్‌తెలిపారు

బాబూరావు సేవలు నిరుపమానం

బాబూరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికుల హక్కుల పరిరక్షణ, సాధనకు అల్లు బాబూరావు చేసిన ఎన్నో పోరాటాలు చేశారని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం బాబూరావు కుటుంబ సభ్యులు, చిట్టివలస లేబర్ యూనియన్, సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యంలో చిట్టివలస జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో బాబూరావు సంస్మరణ సభ జరిగింది. బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పార్టీలు, కార్మికసంఘాల నేతలు మాట్లాడుతూ, సమస్యలపై కార్మికులను, ప్రజలను కదిలించి బాబూరావు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు.

నవచైతన్య కళా నాట్యమండలి వ్యవస్థాపకులు సరగడ చిన్నరెడ్డి ఆధ్వర్యంలో అభ్యుదయ గేయాలు, మహిళా కోలాటం , రైతు కష్టాలు తెలుపుతూ ప్రదర్శన ఆలోచింప జేశాయి. కార్యక్రమంలో చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, సిఐటియు నాయకులు రవ్వ నర్సింగరావు, ఎన్ అప్పలనాయుడు, ఐఎన్‌టియుసి నాయకులు జీరు వెంకటరెడ్డి, కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు దల్లి అప్పలరెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ల సురేష్, సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, పట్టణ ప్రముఖులు రంగూరి సీతారామ దొర, సంఘ సేవకులు రామ్ ప్రసాద్ పాల్గొన్నారు

హయ్యర్ పెన్షన్ వచ్చేవరకు పోరాటం

మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నేత

ప్రజాశక్తి -ములగాడ: హయ్యర్ పెన్షన్ వచ్చేవరకు పోరాటం కొనసాగిద్దామని ఎపి రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ నేతలు స్పష్టం చేశారు. సమోవారం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో ప్రాంతీయ సమావేశంలో కె.నూకరాజు అధ్యక్షతన సమావేశంలో సిహెచ్ తమ్మారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వర్తించే హయ్యర్ పెన్షన్, షిప్‌యార్డు ఉద్యోగులకు వర్తించేలా పోరాటం ఉధృతం చేయాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, ఢిల్లీ ధర్నాకు ఇద్దరు ఎంపీలు హాజరై సంఘీభావం తెలిపారన్నారు. ఇటీవల అసోసియేషన్ చేపట్టిన ఆందోళనలు, పిఎఫ్ కేంద్ర చీఫ్ కమిషనర్‌ను కలిసి విన్నవించిన నేపథ్యంలో దీనిపై కేంద్రమంత్రి దృష్టిసారించినట్లు తెలిపారన్నారు. పెన్షన్ పెంపుపై భిన్న విజ్ఞప్తులతోపాటు హోషియార్ కమిటీ రూ.మూడు వేలు ప్లస్ డీఎ, హైపవర్ కమిటీ రూ.రెండు వేలు ఇవ్వాలని సిఫార్సులు చేసిన నేపథ్యంలో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సమగ్ర నివేదిక కేంద్రకార్మికశాఖ మంత్రికి ఇవ్వనున్నట్లు చెప్పిన నేపథ్యంలో పెన్షన్ పెంపుదల ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయం చేసేలా ఈనెల 18న పిఎఫ్ కార్యాలయాల దిగ్బంధనం జయప్రదం చేయాలని కోరారు.

గాజువాక : హయ్యర్ పెన్షన్ సాధనకు కృషి చేద్దామని భెల్ ఆందోళన కమిటీ సెక్రటరీ అప్పారావు అన్నారు. సోమవారం భెల్ యూనియన్ కార్యాలయంలో ఎస్.అప్పలరాజు అధ్యక్షతన సమావేశంలో జాయింట్ డిక్లరేషన్ ఫారంను పిఎఫ్ కమిషనర్ తిరస్కరించిన నేపథ్యంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎంపీ శ్రీభరత్, కేంద్రమంత్రి రామ్మోహననాయుడు దృష్టికి తీసుకెళ్ళి, వారి సహకారంతో హయ్యర్ పెన్షన్ సాధనకు కృషి కొనసాగించాలని నిర్ణయించారు. సమావేశంలో ఉరుకుటి అప్పారావు, అలమండ వెంకటేశ్వరరావు, అచ్చులు నాయుడు పాల్గొన్నారు.

కమనీయంగా అనంత పద్మనాభుని కల్యాణం

ప్రజాశక్తి-పద్మనాభం : స్థానిక అనంతపద్మనాభ స్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.కొండ దిగువన కుంతీ మాధవస్వామి ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేత అనంత పద్మనాభుడి కల్యాణం కనులపండువగా జరిగింది. అనంతపద్మనాభుని ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై ప్రతిష్ఠించి, కుంతీమాధవస్వామి ఆలయ గాలిగోపురం నుంచి పద్మనాభం ప్రధాన వీధుల్లో ఊరేగించగా, గర్భాలయంలో శ్రీదేవి భూదేవి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంపైనా, గజవాహనంపై గోదాదేవి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున ఆవనావు వారి వీధి రచ్చబండ వద్ద ఎదురు సన్నాహక ఉత్సవం నిర్వహించారు. తర్వాత అదే మార్గంలో ఆలయానికి చేరుకొని కల్యాణం నిర్వహించారు. పద్మనాభుని కల్యాణోత్సవాల్లో భాగంగా కుంతీ మాధవస్వామి ఆలయ ప్రాంగణంలో తాటాకు పందిళ్ల వేసి, ఆలయాన్ని పచ్చనిపూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఇఒ నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో కె.రాంబాబు, కె.లక్ష్మినాయుడు, టి.పాప, కె.లక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- 1488వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం: ఐక్య పోరాటాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటున్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1488వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఐఎన్‌టియుసి కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మికులందరి ఐక్య నినాదం అని, దీనికి తూట్లు పొడవాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఖండించారు. ఒకవైపు కార్మికులకు జీతాలు చెల్లించకుండా, మరోవైపు కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ, ప్రశ్నించిన గొంతులను నొక్కడానికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని అన్నారు. కార్మికులందరూ ఐక్యంగా తిరగబడి పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దీనికోసం కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

28న న్యాయవాదుల సంఘం ఎన్నిక

- నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల అధికారి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా న్యాయవాదుల సంఘానికి 2025-26 సంవత్సరానికి కార్యవర్గ ఎన్నికలకు నోటిఫికేషన్, షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది జిఎం రెడ్డి ప్రకటించారు. ఈనెల 15 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ; 19న నామినేషన్ల పరిశీలన, 20న నామినేషన్ల ఉపసంహరణ, 21న పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్నారు. ఈనెలఉదయం 10 గంటల నుండి సాయంకాలం నాలుగున్నర గంటల వరకు పోలింగ్ నిర్వహించి, వెంటనే ఆరుగంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఆశావహులు ఎన్నికలు ప్రచారాన్ని ప్రారంభించారు. 2025లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కుఎన్నికలు జరగనున్నాయి.దీన్ని దృష్టిలో పెట్టుకొని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శుల పదవులకు గట్టి పోటీ కనిపిస్తోంది.

80మందికి గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యాన ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గ్లకోమా స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. 80 మందికి నేత్ర వైద్యులు డాక్టర్ సౌజన్య గ్లకోమా సంబంధిత పరీక్షలు నిర్వహించారు. గ్లకోమాపై అవగాహనకు ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యప్రదేశాల వద్ద బ్యానర్లు ప్రచారం నిర్వహించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లుజిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఉమా శ్రీనివాస్, సురేష్, హెల్త్ విజిటర్ విజయలక్ష్మి, జూనియర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల హామీని నెరవేర్చాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ● లబ్ధిదారులతో కలిసి దరఖాస్తుల అందజేత

ప్రజాశక్తి -ఆరిలోవ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం విశాఖ రూరల్ తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ పాల్ కిరణ్‌కు రామకృష్ణ ద్వారా వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. అంతక ముందు పెద్ద ఎత్తున సీపీఐ నాయకులు, అర్హులైన లబ్ధిదారులు జాతీయ రహదారి నుంచి చినగదిలి రూరల్ తహసిల్దార్ కార్యాలయం వరకు దరఖాస్తుదారులు ఊరేగింపుగా వెళ్లారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా హామీ అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు.రూ. 3.20 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో ఇళ్ల స్థలాలకు నిధులు కేటాయించని కూటమి ప్రభుత్వం, ప్రస్తుత సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో కట్టిన టిడ్కో ఇళ్లలో అవసరమైన సౌకర్యాలను కల్పించి, వెంటనే పంపిణీ చేయాలన్నారు.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లస్థలాల పంపిణీ ప్రచార ఆర్భాటంగానే సాగింద 35 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెపుతున్న జగన్మోహనరెడ్డి, నివాసయోగ్యంగా ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ కబ్జాదారుల కోరల్లో ఉన్న వేల ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లస్థలాలు,సాగుపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ విమల, ఎస్‌కె రెహమాన్, జిఎస్‌జె అచ్యుత రావు, వి సత్యనారాయణ, కె లక్ష్మణరావు, ఎం ఎ బేగం, బి పుష్పలత, విలక్ష్మి, సిహెచ్ కాసుబాబు, ఎ రవి, బి చిరంజీవి, ఎన్ త్రినాథ్, జెడి నాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేస్తున్న రామకృష్ణ, మహిళలు

పెందుర్తి: పేదలకు ఇళ్లస్థలాలను ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీలను అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ వద్ద వందలాది మంది ఇంటిస్థలాల దరఖాస్తుదారులతో నిరసన చేపట్టి, తహశీల్దార్‌కు వాటిని అందజేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, వై రాంబాబు, ఎన్ అశిరినాయుడు, అన్నపూర్ణ, రాము,రమణ, పరుశురాం, కె.రజని, అనురాధ, దుర్గారావు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టడమే ప్రభుత్వాల ధ్యేయమా?

- సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడం తగదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశంలో కార్పొరేట్ దిగజాలు అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెట్టడమే కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాల ధ్యేయంగా కనిపిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఈ సమస్యలపై ఉద్యమించేందుకు ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. టిడిపి కూటమి ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన తల్లికి వందనం, యువతకు ఉపాధి /నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడిసాయం, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం వంటివి నేటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపిస్తామని, రూ.100 కోట్లు నిధులను కేంద్రం నుంచి రప్పిస్తామని, కేంద్రం ఇవ్వకుంటే తన సొంత నిధులను ఖర్చు పెడతామనిఅనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో ఏర్పడిన సహకార రంగాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 14 సహకార చక్కర కర్మాగారాలు గతంలో ఉండేవని, వాటిలో చాలావరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే అమ్మకాలు చేశారని తెలిపారు. విశాఖ, విజయ పాల డెయిరీలను కంపెనీ చట్టం కింద మార్చి ప్రజలకు చెల్లించాల్సిన వాటాలు చెల్లించలేదన్నారు. విజన్ 2047 పేరుతో ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తామన్న చంద్రబాబు హామీ మాట అటు ఉంచితే ఉన్న సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి, రైతు బకాయిలు చెల్లించే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దానిని ప్రశ్నించే ట్రేడ్ యూనియన్ నాయకులకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు, కార్మికులు చేసే ఉద్యమాలకు అండగా ఉండి ఉధృతం చేస్తామని శ్రీనివాసరావు హెచ్చరించారు.

సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు మూడు నెలల వేతనాలు, రైతులకు చెరకు బకాయిలు రూ.35 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఫ్యాక్టరీని ఆదుకుంటామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపినా బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. రైతులకు సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపడంతో చెరకు సాగు విస్తీర్ణత శాతం తగ్గిపోయిందని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు సుగర్ ఫ్యాక్టరీల పంచదారను అనుసంధానం చేస్తే సహకార చక్కెర కర్మాగారాలు అభివృద్ధి చెందుతాయని, ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ముందుగా సామాజిక విప్లవ నాయకురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, లోకనాథం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో మత చాందస భావాలను రూపుమాపేందుకు సావిత్రిబాయి పూలే కృషి చేశారన్నారు. ఆమె స్ఫూర్తితో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్య హక్కు చట్టం ద్వారా చదువుతున్న పేద విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఉచిత విద్య అందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టి కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గతంలో రెండుసార్లు వినతి పత్రం కలెక్టర్‌కు ఇవ్వడం జరిగిందని, అయినా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలు నేటికీ విద్యార్థులు తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నా జిల్లాలో ఉన్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. తల్లిదండ్రులు అటు ఫీజులు చెల్లించలేక ఇటు చదువును మధ్యలో ఆప లేక ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్ షెఫర్డ్, విద్యాధరి, శ్రీచైతన్య, నారాయణ, భాష్యం లాంటి పాఠశాలలు విద్యార్థులు తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన సీట్లు కూడా ఫీజులు చెల్లించాలని కోరడం అత్యంత దుర్మార్గమన్నారు. ఫీజులు కట్టకపోతే పరీక్షలు రానివ్వమని, స్కూల్‌కి రానివ్వకుండా, విద్యార్థి డెయిరీలో ఫీజు కోసం రాయడం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీజులు అధికంగా వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే విద్యార్థులు కట్టిన ఫీజు తిరిగి చెల్లించాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పెంటకోట ప్రభాకర్, సూరిశెట్టి సురేష్, అనిల్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో జిల్లా విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కెకెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై.శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 440 అర్జీలు వచ్చాయి. అనంతరం జిల్లా కలెక్టరు శాఖలవారీగా పి.జి.ఆర్.ఎస్. పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వచ్చిన అర్జీలు వచ్చే వారం నాటికి పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్జీలకు పరిష్కారం చూపడమేకాకుండా, పరిష్కారం కాని దరఖాస్తులకు వివరంగా సమాధానం తెలియజేయాలని సూచించారు.

భక్తులతో కిటకిటలాడిన గిరిజాంబ గిరి

ప్రజాశక్తి-వడ్డాది : శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న వడ్డాది గిరిజాంబ గిరి భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామివారి 152వ వార్షిక కళ్యాణోత్సవాలలో భాగంగా తొలి రోజు ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు 3 గంటలకు ధర్మకర్తల దొండా కన్నబాబు, శ్రీరామ్‌లు తొలి పూజలు చేసి భక్తులకు సర్వదర్శనాలు ప్రారంభించారు. బుచ్చయ్యపేట ఎస్సై ఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన నానిపల్లి గణేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.1.57,000 చెక్కును చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తమరాన దాసు తదితరులు పాల్గొన్నారు

నాగులాపల్లి గ్రోయిన్ మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మూలపేట గ్రామం వద్ద శారదానది అనుకోని ఉన్న ఆనకట్ట నాగులాపల్లి గ్రోయిన్ శిదిలావ్యవస్థకు చేరి నదిలో ఉన్న నీరంతా వృధాగా సముద్రం పాలువుతుందని, తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించాలని గ్రామ అభివృద్ధి పోరాట కమిటి కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డివో కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఏవోకు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

పి-4 సర్వేను వేగవంతం చేయాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి -అనకాపల్లి

పేదరికం నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వ ప్రయివేటు ప్రజల భాగస్వామ్యం (పి4) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఎంపీడీఓలను ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం పి 4 సర్వే, పంచాయతీ రాజ్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్, డ్వామా, జిల్లా పరిషత్, పిజిఆర్ఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పి4 సర్వే కార్యక్రమంలో భాగంగా విఆర్‌ఓ, విఆర్‌ఎలను, సర్వేయర్లను మినహాయించాలని, ముఖ్యంగా నాతవరం, కోటవురట్ల మండలాల్లోలో పి 4 సర్వే వేగవంతం చెయ్యాలని ఎంపీడీఓలను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బి టి /సి సి రోడ్లను ఈ ఆర్థిక సంత్సరంలోపు పూర్తి చెయ్యాలన్నారు. ఈ వారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి తిరిగి చెత్త సేకరించాలని, తడి పొడి చెత్తలను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చాలని సూచించారు. స్కూల్ ప్రహరీ గోడలను పశు సంవర్ధక శాఖకు సంబంధించిన గోకులం షెడ్లను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవికాలంలో జిల్లాలో తాగునీరు సమస్య లేకుండ చూడాలన్నారు. ఎన్ఆర్ఈజిఎస్‌కు సంబంధించి పనులను, కేటాయించిన పనిదినాల లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా పంచాయత్ రాజ్ ఈఈ వీరం నాయుడు, డ్వామా పిడి పి పూర్ణిమ దేవి, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, జెడ్‌పి సిఈఓ నారాయణ మూర్తి, ఆర్ డబ్ల్యుఎస్ ఈఈ ఎస్.ఎ. రామస్వామి, ఇతర జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, జోనల్ కమీషనర్, ఎంపీడీఓలు, పంచాయత్ రాజ్ డిఇలు, జెఇలు తదితరులు పాల్గొన్నారు.

'మెషిన్ లెర్నింగ్ మేడ్ ఈజీ' పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో "మెషిన్ లెర్నింగ్ మేడ్ ఈజీ" అనే అంశంపై సోమవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఈదర శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఇంకా మెషీన్ లెర్నింగ్‌లో మెలకువలు, అడ్వాన్స్డ్ అంశం అయిన క్వాంటం కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ అంశాలపైన అవగాహన కల్పించారు. మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ ఆరోగ్య సంరక్షణ, ఫైనాన్స్, వినోదం వంటి పరిశ్రమలను రూపాంతరం చెందిస్తున్నాయని, ఈ సాంకేతికతలు డేటా నుండి నేర్చుకునే సామర్థ్యాన్ని యంత్రాలకు అందిస్తాయని పేర్కొన్నారు. నిర్ణయాల పరంగా మెరుగైన సామర్థ్యం పెరుగుతుందని అయితే, ఇవి అనేక ప్రయోజనాలను అందించినప్పటికీ, డేటా గోప్యత, పక్షపాతం, నైతిక పరమైన సమస్యలు వంటి సవాళ్లు ఉన్నాయని తెలిపారు. సమర్థవంతమైన, నాణ్యమైన అభివృద్ధి, వినియోగాన్ని నిర్ధారించేందుకు ఈ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, సియస్డియమ్ విభాగాధిపతి ఎ. వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.9 కోట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలో పలు రహదారుల నిర్మాణానికి రూ.9 కోట్లు విడుదలైనట్లు తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో క్వారీలు క్రషర్ల వల్ల రోడ్లు దెబ్బతినడంతో ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దష్టికి ఆయా గ్రామాల కూటమి నాయకులు తీసుకువెళ్లినట్లు చెప్పారు. దీనిపై ఆయన స్పందించి తక్షణమే రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దీంతో డిహెచ్ఎఫ్ఎం నిధులు 9 కోట్ల 33 లక్షల రూపాయల నిధులను విడుదల చేయించారని తెలిపారు. బగులువాడ, మామిడిపాలెం, మాకవరం, మాటూరు, సిహెచ్ ఎన్ అగ్రహారంలో గ్రామాలలో క్వారీలు, క్రషర్ల వలన రహదారులు దెబ్బతిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అనకాపల్లి జనసేన మండల నాయకులు ఎంపిటీసీ చదరం నాగేశ్వరరావు, మాజీ జడ్పిటిసి భరత్ బాబు, పచ్చికూర రాము, గంగుపాం జగదీష్, తలారి కాశీ నాయుడు బంటు రవి, బత్తుల రమేష్, పీలా తాతు నాయుడు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ పోలీస్ రక్షణ సిబ్బంది మహిళా భద్రత, మహిళలకు స్వీయ రక్షణ, మహిళా భద్రతల్లో పురుషుల పాత్ర తదితర అంశాలపై కసింకోటలో ఇటీవల జరిగిన వక్తృత్వ పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పాఠశాలకు చెందిన ఎ.దీక్షిక (తొమ్మిదో తరగతి) మొదటి స్థానాన్ని, వి.చరిత సత్య శ్రీ (ఏడవ తరగతి) ద్వితీయ స్థానాన్ని, ఎం.రిషిత (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానాన్నికైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం స్కూల్ కరెస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపల్ రూపానంది అభినందించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

యలమంచిలిలో మాట్లాడుతున్న బివి.రాణి

ప్రజాశక్తి-యలమంచిలి

దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక బాలిక హైస్కూల్లో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యుటిఎఫ్ మండల అధ్యక్షురాలు బివి రాణి మాట్లాడుతూ భర్త జ్యోతీరావుపూలే ప్రోత్సహంతో మహిళా విద్య ద్యారానే మార్పు సాధ్యమని నమ్మిన ఆమె పూణేలో బాలికల పాఠశాల ప్రారంభించి బాలికా విద్యాను ప్రోత్సహించారని తెలిపారు. శూద్రులు, అస్పృశ్యుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.బాలాజీ, ఎన్.మల్లేశ్వరి, తెరపల్లి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : భారతదేశంలో మహిళా విద్యకు అంకురార్పణ చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని దేవరాపల్లి గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, అంబేద్కర్ ఆశయ సాధన సమితి మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు అన్నారు. దేవరాపల్లి అంబేద్కర్ కాలనీలో సోమవారం సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు, తాడి ఎర్నిబాబు, ఉల్లి మహేష్, ఉల్లి పరశురాం, కంకడాల సన్నిబాబు, కాటపల్లి సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ములగాడ: బాల్యవివాహాలకు, సతీ సహగమనానికి, అంటరానితనానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారని, స్త్రీ విద్యకు, వితంతు పునర్వివాహాలకు అనుకూలంగా సావిత్రి బాయి పూలే ఉద్యమించారని, ఆమె మహిళలందరికీ స్ఫూర్తిదాయకమని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని పూలే, 18 స్కూళ్లను స్థాపించి స్త్రీ విద్యకు ఎంతో కృషి చేశారని అన్నారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, కార్యకర్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం జ్యోతిబాపూలే జీవిత చరిత్రపై క్విజ్ పోటీని నిర్వహించారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు

ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి అవినీతికి పాల్పడుతున్నారని, ఆయనపై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ఉప సర్పంచ్ కరణం సురేష్ బాబు జిల్లా కలెక్టర్‌కు సోమవారం పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అసకపల్లి పంచాయతీలో ప్రభుత్వ బంజరు స్థలాలలో అక్రమంగా నిర్మించిన ఇళ్లకు, షెడ్డులకు సర్పంచ్‌తో కుమ్మక్కై ఇంటి పన్నులు మంజూరు చేసి అక్రమంగా సుమారు రూ.50 వేలు వసూలు చేశారన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా అక్రమ షెడ్లు నిర్మాణం చేపడుతున్న వారికి ఇంటి పనులు ఎలా మంజూరు చేస్తున్నారని ప్రశ్నించారు. స్మశాన వాటికలో కొబ్బరికాయల వేలం వేసి డబ్బులు పంచాయితీకి జమ చేయలేదన్నారు. గతంలో పంచాయతీ ఖర్చులు, జమలు వివరాలను ఎన్ని సార్లు అడిగినా కార్యదర్శి చెప్పలేదని తెలిపారు. వీధిలైట్లు కొనుగోలులో అవకతవకలు జరిగాయన్నారు. జమ, ఖర్చులు గురించి బోర్డు మీటింగ్లో 9 మంది వార్డు సభ్యులు అడిగినా ఇంతవరకు సమాధానం లేకుండా తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి ఆసకపల్లి పంచాయతీలో జరిగిన అవినీతిని వెలిగి తీసి చర్యలు తీసుకోవాలని కోరారు.

పలు కార్యక్రమాల పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలో ఈ నెలలో జరిగే పలు కార్యక్రమాలకు సంబంధించి వాల్ పోస్టర్లను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ 15న స్థానిక దళితవాడలో నిర్మాణంలో ఉన్న రామాలయంలో రాముల వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరగనుంది. వాడ్రాపల్లి గ్రామంలో ఈ నెల 18న పారిపల్లి అమ్మవారి పండగ మహోత్సవ జరగనుంది. వీటికి సంబంధించి పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

12న యువత పోరును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక : జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 12వ తేదీన జరుగు యువత పోరును జయప్రదం చేయాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో వైసీపీ శ్రేణులతో కలిసి సోమవారం ఆయన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరుగు ఈ నిరసనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆడారి లక్ష్మణరావు, మద్దాల వీరి నాయుడు, కాండ్రేగుల జగన్, రమణమ్మ, పెంటకోట శ్రీనివాసరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

'మా స్థలం జోలికొస్తే సహించేది లేదు'

ప్రజాశక్తి-కె.కోటపాడు : పూర్వకాలం నుంచి తమ అధీనంలో ఉన్న స్థలం జోలికి ఏ ఒక్కరు వచ్చినా సహించేది లేదని మండలంలోని లక్కవానిపాలెం గ్రామానికి చెందిన మహిళలు హెచ్చరించారు. ఆ గ్రామంలో సుమారు రూ.4 కోట్ల విలువైన స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు ఆక్రమించుకునే ప్రయత్నం చేయడంతో పాటు రెండు నెలల క్రితం ఆ స్థలానికి ఎదురుగా ఉన్న రెండు షాపులను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా గ్రామస్తులు, వాటాదారులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. దగ్ధమైన షాపు యజమాలతో పాటు వాటాదారులు కూడా ఏ కోడూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఉన్నారు. ఇది ఇలా ఉండగా వాటాదారులకు సంబంధించిన మహిళలు ఒకటై ఆ స్థలానికి వెళ్లి హద్దులు ఏర్పరచుకొని ఎవరు వాటాల వాళ్ళు స్వాధీన పంచుకున్నారు. విషయం తెలిసి ఏ.కోడూరు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మహిళలను ఆ స్థలంలోకి వెళ్లకుండా అడ్డుపర్చే ప్రయత్నం చేశారు. అయినా మహిళలు వినలేదు. షాపులు, ప్రహరీ గోడ దగ్ధం చేసినప్పుడు రాని పోలీసులు ఇప్పుడు ఎలా వచ్చారని ప్రశ్నించారు. ఎవరు వచ్చినా మా స్థలంలోకి అడుగుపెట్టనివ్వని మహిళలు తెగేసి చెప్పారు.

స్థలంలో సరిహద్దు రాళ్ళు వేసుకుంటున్న మహిళలు

డిఎస్‌సికి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం త్వరలో విడుదల చేయబోయే మెగా డి.ఎస్.సి. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్లైన్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాకు చెందిన అర్హత, ఆసక్తిగల బిసి, ఇడబ్ల్యూఎస్ (ఈబీసీ) కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మార్చి 10వ తేదీ నుండి ఆన్లైన్‌లో ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లాకు సంబందించిన టిఇటి (టి ఈ టి) అర్హత సాధించిన అభ్యర్థులు అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూరించిన దరఖాస్తుకు కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టిఈటి పరీక్షలో అర్హత సాధించినందుకు రుజువు వంటి అవసరమైన ఎన్ క్లోజర్లతో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి, అనకాపల్లి వారికి సమర్పించాలని సూచించారు. ఇతర వివరములకు 9885845743, 8247036596 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అసకపల్లిలో దర్జాగా భూ కబ్జాలు

- ఆపై జోరుగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

అసకపల్లి సర్వే నెంబర్ 87లో అక్రమంగా నిర్మించిన షెడ్, పునాదులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అసకపల్లి పంచాయతీలో భూకబ్జాలు పెచ్చు మీరిపోతున్నాయి. అక్రమ నిర్మాణాలు హద్దూ అదుపు లేకుండా జరుగుతున్నాయి. అసకపల్లి సర్వేనెంబర్ 87లో రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆ పంచాయతీ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి, విఆర్ఓ కనుసన్నల్లో కబ్జా చేసి అక్రమంగా పునాదులు నిర్మించారు. ఈ ప్రభుత్వ స్థలంలో నక్క రాంబాబు అనే వ్యక్తి షెడ్డు నిర్మించినట్లు, విశాఖకు చెందిన ఇద్దరు వ్యక్తులు పునాదులు నిర్మించినట్లు గ్రామానికి చెందిన అడపా గణేష్ తెలిపారు. అసకపల్లి సర్వే నెంబర్ 1లో సుమారు రూ.4 కోట్ల విలువైన ఎకరా భూమిలో అక్రమంగా నక్క సింహాచలం అలియాస్ తాతబాబు అనే వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నారని, సర్వేనెంబర్ 1లో గ్రావెల్ క్వారీ కూడా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రెవిన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను కాపాడాలని, భూకబ్జాలను తొలగించి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని అడపా గణేష్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఆసకపల్లి పంచాయతీలో భూ కబ్జాలపైనా, అక్రమ నిర్మాణాలపైనా దర్యాప్తు చేసి తక్షణమే తొలగించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అసకపల్లి పంచాయతీలో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, అవినీతిపై దృష్టి సారించి దర్యాప్తు జరిపి దానికి బాధ్యులైన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

భూకబ్జాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

అసకపల్లిలో భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని అసకపల్లి గ్రామస్తులు అడపా గణేష్ కుమార్ పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అసకపల్లి సర్వే నెంబర్ 1లో ప్రభుత్వ భూమిని 3సెంట్లు చొప్పున ప్లాట్లు వేసి విఆర్ఓ సర్పంచ్‌తో కుమ్మక్కయి విక్రయిస్తున్నారని ఆ పిర్యాధులో పేర్కొన్నారు. అలాగే సర్వే నెంబర్ 87లో సుమారు ఎకరా కొండవాగు స్థలంలో అక్రమంగా షెడ్డులు, పునాదులు నిర్మించి విక్రయించిన స్థానిక వీఆర్వో చర్యలు తీసుకోలేదని తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని ర్యాలీ

ప్రజాశక్తి-పరవాడ : ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరుతూ 54వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, ఫార్మా సిటీ, అనకాపల్లి జిల్లాలో 205 ఫార్మా పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మా పరిశ్రమల్లో జరిగిన వివిధ ప్రమాదాల్లో 25 మంది మృతి చెందారని, 59 మంది గాయపడ్డారని తెలిపారు. సెనర్జన్ ఫార్మా ప్రమాదం జరిగినప్పుడు ఐఎఎస్ మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఏమైందని గనిశెట్టి ప్రశ్నించారు. కార్మిక శాఖ మంత్రి వాస్తవాలను దాచిపెడుతున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం ఐదుగురు మాత్రమే మృతి చెందినట్లు చెప్పడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాలకు అండగా నిలవడంతో భద్రత ఆడిట్ జరగడం లేదని, ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తించిన లోపాల ఆధారంగా యాజమాన్యాలపై చర్యలు లేకపోవడంతో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం యాజమాన్యాలు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఫార్మా పరిశ్రమల్లో భద్రత ఆడిట్ నిర్వహించాలని, కమిటీ నివేదికను వెంటనే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి చిన్నారావు, కేదార్ బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోరాదు

ప్రజాశక్తి-కె.కోటపాడు : 14 సంవత్సరముల లోపు బాలబాలికలను ఏ వృత్తిలోనూ నియమించుకోరాదని, అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని చోడవరం సహాయ కార్మిక శాఖ అధికారి పి సూర్యనారాయణ తెలిపారు. మండల కేంద్రం కే కోటపాడులో సోమవారం ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారుతో కలిసి పలు దుకాణాలను, బేకరీలను షాపులను తనిఖీ చేశారు. ప్రమాదకరమైన పనుల్లో 18 సంవత్సరాలు లోపు వ్యక్తులను పనిలో పెట్టుకోరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ సంస్థ తరపున చిన్నారావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెఏడి జెడ్పీ హైస్కూల్లో 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వడ్డాది హైస్కూల్‌లో జరిగింది. ఒకరినొకరు పరిచయం చేసుకుని సంభాషించుకున్నారు. తమకు విద్య చెప్పిన గురువులను ఆహ్వానించి సాలు వాళ్ళు కప్పి సన్మానించారు. అనంతరం గ్రౌండ్లో మొక్కలు నాటారు. విందు వినోదాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. తమతో చదువుకున్న విద్యార్థులు కష్టాల్లో ఉన్నప్పుడు తమంత ఒకటై వారి కష్టాల్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామాగ్రిని దాత రంది వెంకట్రావు సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ, పాఠశాల హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరరావు, గంగావంశం సంతోష్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలి

ప్రజాశక్తి-కశింకోట : పాడి రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలని పశు వైద్యులు ఆల్ఫాన్స్ జార్జ్, చైతన్య మణి అన్నారు. కశింకోట పశు వైద్య కేంద్రం వద్ద పాడి పరిశ్రమపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశు అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర ప్రతినిధి జయచంద్ర, ఆళ్ళ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అంగన్‌వాడిల పోరాటంపై పోలీసు నిర్బంధం తగదని, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలంటూ సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి అందోళన చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, గత సమ్మె కాలంలో అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడ వెళుతున్న అంగన్వాడీలపై ప్రభుత్వం పోలీసులతో ఇళ్ళలోను, రోడ్డలపై నిర్బందించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రదానమైన వేతన సమస్యను పరిష్కరించకుండా గ్రాడ్యూటీని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అంగన్వాడీలను మోసగించడేమ అవుతుందన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్స్‌గా చేస్తామని చెప్పారని నేటికీ అమలు కాలేదన్నారు. రేషన్ కార్డులు తొలగించడంతో అంగన్‌వాడీలు ఆరోగ్యశ్రీకి నోచుకోలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్వదించి అంగన్‌వాడీల సమస్యలు పరిస్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, గొలుగుండ ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, పీ.వరలక్ష్మి, ఆర్.కృష్ణవేణి, రమణమ్మ, హైమా, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న గణేష్

'యువత పోరు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 12న అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన వంటివి అమలు చేయాలన్నారు. నిరుద్యోగ భృతితో పాటు కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. 12న జరిగే ఈ కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు భారీగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎంపిపి సుర్ల రాజేశ్వరి, గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఎల్‌పిసిలు మంజూరు

ప్రజాశక్తి -కోటవురట్ల:అర్హులైన గృహ లబ్ధిదారులకు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు (ఎల్‌పిసి)లు మంజూలు చేస్తామని తహసిల్దారు తిరుమల బాబు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గృహాలకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 628 మంది ఉండగా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులకు మాత్రమే ఎల్పిసిలు మంజూరు చేస్తామని తెలిపారు, గ్రామాల వారీగా అన్నవరంలో 63, బోడపాలెం 57, బాపిరాజు కొత్తపల్లి 24, చిన్న బొడ్డేపల్లి 32, చౌడవాడ 46, గొట్టువాడ 8, జల్లూరు 35, కైలాస పట్నం 9, కోటవురట్ల 30,లింగాపురం 21, పాములవాక 43, పొందూరు 64, పీకపల్లి 60 రాజుపేట 54, సుంకపూరు 13 టీ జగ్గంపేట 24, తంగేడు 11, వెంకటాపురం 18, ఎండపల్లి 11 గృహ నిర్మాణ శాఖ అధికారులు గుర్తించగా వీటిని రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు,

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- మాడుగుల:భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 11న మంగళవారం ఉదయం 10 గంటల నుండి విశాఖ డైరీ పాల కేంద్రం, శతకం పట్టు వద్ద మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, గుండె వ్యాధులు, స్త్రీల సమస్యలు ఇలా అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా తనిఖీ చేసి మందులు ఇస్తారని తెలిపారు. కంటి సమస్యతో బాధపడే వారికి తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తారన్నారు. విశాఖపట్నంకు చెందిన ఇండస్ హాస్పిటల్, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నుండి డాక్టర్లు వస్తున్నారని, ఈ అవకాశాన్ని మాడుగుల చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు కోరారు. పూర్తి వివరాలకు ఈ క్రింది నెంబర్లను 9885158841, 9133495758 సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు విద్యుత్ సబ్ స్టేషన్ 11 కె. వి గొడిచెర్ల ఫీడరులో ఆర్ డి ఎస్ ఎస్ పనులతో ఈనెల 11న మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్కో ఎఇ కృష్ణ ప్రకటనలో తెలిపారు. చినదొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ, జి జె పురం,చీడిక, రేవల్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలపై సిపిఎం ఇంటింటా సర్వే

సమస్యలు తెలుసుకుంటున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 63వ వార్డు క్రాంతినగర్‌లో సిపిఎం ప్రజా చైతన్య యాత్రను పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు ప్రారంభించారు. సిపిఎం శ్రేణులు బృందంగా వెళ్లి ఇంటింటా సమస్యపై సర్వేచేశారు. ఈ సందర్భంగా ఇళ్లు, ఇళ్లస్థలాలు, విద్యుత్, ఇతర ఛార్జీలు, రోడ్లు, కాలువలు, రేషన్‌కార్డులు, పింఛన్లు తదితర వ్యకిగత, సామాజిక సమస్యలను స్థానికులు సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించి, జగ్గునాయుడు మాట్లాడుతూ, ప్రజాచైతన్యయాత్ర సర్వేలో గుర్తించిన సమస్యలపై వార్డు సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి, వాటి పరిష్కారానికి సిపిఎం తరపున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు, జోన్ నాయకులు కె.పెంటారావు పివి. భాస్కరరావు, ఆర్ లక్ష్మణమూర్తి క్రాంతినగర్ శాఖ కార్యదర్శి పి సురేష్, ఎం ఆదినారాయణ, ఎస్.వాసు, జి.నరేష్, స్థానికులు జి.దుర్గాప్రసాద్, ఎస్ఎస్ అప్పారావు, ఆర్ అప్పారావు, సమీర్, జి.దాసు, నవీన్, కిరణ్, మురళి, ప్రేమ్ పాల్గొన్నారు.

రోలుగుంట:రోలుగుంట మండలం పెదపేట, ఎంపేట గ్రామాల్లో సిపిఎం ప్రజా చైతన్య యాత్రను సోమవారం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, పెదపేట గ్రామానికి డ్రైనేజ్ లేక నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయి సీజనల్ జ్వరాలైన టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెదపాడు గ్రామానికి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెదపేట, ఎంపేటలో జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే స్వయంగా వచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, జీడిపప్పు రైతులకు ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని, పురుగుల మందులు సప్లై చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

రోలుగుంటలో చేపడుతున్న చైతన్య యాత్ర

మాట్లాడుతున్న సిఐ

సారా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- మాడుగుల:నవోదయం 2.0 కార్యక్రమం లో భాగంగా మండలములో గొప్పులపాలెం, కొండలపాడు గ్రామాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైంజ్ శాఖ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేసారు. గ్రామస్తులకు కళా జాత ద్వారా నాటుసారాకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాటుసారాపై ఫిర్యాదులకు 14405 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియజేయాలన్నారు.

సిఐఎస్ఎఫ్ రైజింగ్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ 56వ సిఐఎస్ఎఫ్ రైజింగ్ డే వేడుకలను సాలిగ్రామపురం సిఐఎస్ఎఫ్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ముఖ్య అతిథిగా హాజరై సిఐఎస్ఎఫ్ యూనిట్ పరేడ్‌ను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరిశ్రమలను నిరంతరం రక్షిస్తున్న సిఐఎస్ఎఫ్ సిబ్బంది సేవలను కొనియాడారు. సిఐఎస్ఎఫ్ యూనిట్ తన నైపుణ్యాలను ప్రదర్శించింది. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీ సిఐఎస్ఎఫ్ యూనిట్ సీనియర్ కమాండెంట్ సతీశ్ కుమార్ బాజ్‌పాయ్ పర్యవేక్షించారు. విపిఎ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పిఎస్ఎల్.స్వామి హాజరయ్యారు.

ఘనంగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలు

-పట్టు వస్త్రాలు సమర్పించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కళ్యాణోత్సవాలు సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఉపమాక భక్తజనసంద్రంగా మారిపోయింది. నక్కపల్లి నుంచి ఉపమాక వచ్చే రహదారులన్ని భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణం భక్తుల గోవిందనామ స్మరణతో మారుమ్రోగింది.భక్తులు బందరు సరస్సులో పుణ్యసాన్నాలు అచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు.

ఉత్సవాల్లో తిరుపతి నుంచి తీసుకువచ్చిన లడ్డూలు విక్రయించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పట్టు వస్త్రాల సమర్పణ

కల్యాణోత్సవాల్లో భాగంగా హెూంమంత్రి వంగలపూడి అనిత కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ ప్రతినిధులు కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అధికారులు,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

సేవా కార్యక్రమాలు

హెూం మంత్రి వంగలపూడి అనిత ఆర్థిక సహాయంతో భక్తులకు క్యాలెండర్ లు, మజ్జిగ పంపిణీ చేశారు. హెటిరో డ్రగ్స్ ఉద్యోగుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. నక్కపల్లి శ్రీసత్య సాయి భజన మండలి, సర్వేజనో సుఖినోభవంతుతో పాటు సేవ సంస్థలు భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.గొడిచెర్ల పి. హెచ్. సి, హెటరో డ్రగ్స్, పలు ప్రైవేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు.

పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ కుమార స్వామి బందోబస్తును పర్యవేక్షించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వివిధ సాంస్కతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన చిన్నారుల నత్యాలు, భరతనాట్యం, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ శ్రీనివాస భజన సమాజం సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు.వెంకన్నను కలెక్టర్ విజయ కృష్ణన్, విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి , అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా దర్శించుకున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అనిత

ఉపాధి హామీ కూలీలకు అవగాహన

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో ఫారం పాండ్స్ పనులను చేపడుతున్న ఉపాధి కూలీలకు, రైతులకు వీటితో కలిగే ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి వరహాలు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫారం పాండ్స్ పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పొలంలో పడిన వర్షంపు నీరు బయటకు వృథాగా పోకుండా మన పొలంలోనే ఇంకే విధంగా ఫారం పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.పొలంలోనే నీటిని నిలువ చేసుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

స్టీల్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌లో సుమారు 15 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వీరు లేకపోతే ప్లాంట్ మనుగడ సాధ్యం కాదని తెలిపారు. ఒక పక్కన స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతూ, మరోపక్క ప్లాంట్‌లో పనిచేస్తున్న కీలకమైన కాంట్రాక్టు కార్మికులను తొలగించాలనుకోవడం దుర్మార్గం అని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులలో అత్యధికమంది భూములు కోల్పోయిన నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. స్టీల్ యాజమాన్యం మూడు నెలలకు 1400 మందిని చొప్పున సంవత్సరంలో 5,600 మంది కార్మికులను తొలగించేందుకు సన్నాహాలు చేస్తోందని, తక్షణమే ఈ చర్యలను ఆపాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్టీల్ యాజమాన్యంపైనా, కేంద్ర ప్రభుత్వంపైనా ఒత్తిడి తీసుకొచ్చి కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను తక్షణమే ఆపాలని డిమాండ్‌చేశారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న సదాశివనగర్ ప్లాట్ ఓనర్లు

జివిఎంసికి విఎంఆర్‌డిఎ రాసిన లేఖను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సదాశివనగర్ లే-అవుట్‌లో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయవద్దంటూ జివిఎంసికి విఎంఆర్‌డిఎ అధికారులు రాసిన లేఖను ఉపసంహరించుకోవాలని సోమవారం టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యాన అసోసియేషన్ సభ్యులు విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌కు వినతిపత్రం అందించారు. సుదీర్ఘ కాలంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం విల్లూరి చక్రవర్తి మాట్లాడుతూ 2017లో రిట్ పిటిషన్ కారణంగా ఆరేళ్లకుపైగా తమ లే-అవుట్ క్రమబద్ధీకరించడంలో జాప్యం జరిగిందన్నారు. సుదీర్ఘ పోరాటం తరువాత 2024లో తమ లే-అవుట్ క్రమబద్ధీకరించారని తెలిపారు. ఆ లే-అవుట్‌లో స్థలాలు కొనుకున్నవారంతా వృద్ధులేనని, క్రమబద్ధీకరించారని సంతోషించి తామంతా నిర్మాణ ప్రక్రియ అనుమతుల కోసం జివిఎంసికి దరఖాస్తు చేసుకున్నామని వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కమిషనర్ స్పందించి వారం వ్యవధిలో సమస్యకు పరిష్కారం సూచిస్తామని హామీఇచ్చారని సభ్యులు తెలిపారు.

ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికుల కనీస పెన్షన్ పెంచాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారని, దాదాపు పదేళ్లుగా ఇదే పెన్షన్ చెల్లించడం శోచనీయమని ఎపిఎస్ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం రీజియన్ అధ్యక్షులు ఎం.ఈశ్వరరావు, కార్యదర్శి ఎ.వెంకటరావు పేర్కొన్నారు. ఈ మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక పింఛన్ రూ.4000 ఇస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. తమకు కనీసం ఆవిధంగానైనా ఇవ్వాలని ఈ నెల 14న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఎం.జగ్గారావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వివికె.రాయ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ..

ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-మాడుగుల: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలో శంకరం పంచాయతీ గొప్పూరు, తాడివలస గిరిజన మహిళలు సోమవారం ఖాళీ బిందెలు తలపై పెట్టుకుని నిరసన చేపట్టారు. వీరికి మద్దతుగా ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రదాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ, ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజనులకు మంచినీటి కష్టాలు తప్పడం లేదన్నారు. గతంలో ఇంటింటి కులాయి ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా నీరు అందించడం జరిగిందన్నారు. ఇంటింటి కొళాయిల ద్వారా గొప్పూరు, తాడివలస గ్రామాలకి మంచినీరు రెండు రోజుల రాలేదన్నారు. మోటారు పని చేయక పోవడంతో మహిళలు చేతి బోర్లను, గెడ్డలు వద్ద తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గ్రామాలకు మంచినీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి సన్యాసమ్మ, సోలం మంగ, సోలం వరలక్ష్మి, సోలం రాము తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న మహిళలు

మహిళల రక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యం

-హోం మంత్రి వంగలపూడి అనిత

శక్తి బీట్ వాహనాలు, డ్రోన్స్ ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి: మహిళల రక్షణే ఎన్డియే కూటమి లక్ష్యం అని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం హెూం మంత్రి అనిత శక్తి బీట్ వాహనాలు,డ్రోన్స్ ప్రారంభించారు. ఎన్టిపిసి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్, మహిళా చట్టాలు, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించే ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అనిత మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా చెక్ ఫోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. టెక్నాలజీ ఉపయోగించి గంజాయి సాగు, రవాణా లేకుండా ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. 6 నెలల కాలంలో గంజాయి కేసుల్లో సుమారు 500 మందిని అరెస్ట్ చేశామని, ఏజెన్సీలో గంజాయి సాగు పూర్తిగా తగ్గిందన్నారు. విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి విద్యార్థులు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆడపిల్లలు శక్తి యాఫ్ డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. 112 కు ఫోన్ చేస్తే 15 నుండి 20 నిమషాల్లో శక్తి టీమ్ మీ ముందు ఉంటుందన్నారు.గంజాయి కేసుల్లో పట్టుబడితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలుపుదల చేసే ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో లక్ష సీసీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ విజయ కష్ణన్,విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి , అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చట్టాలపై అవగాహన కల్పించారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులను సత్కరించారు. దీనికి ముందు నక్కపల్లి పోలీస్ స్టేషన్ నుండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానం వరకు విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలన ర్యాలీ నిర్వహించారు.

కానిస్టేబుల్‌ను సత్కరిస్తున అనిత

చిల్లర వర్తకులకు న్యాయం చేయాలి

-సిఐటియు జగదాంబ జోన్ కమిటీ

నిరసన తెలుపుతున చిల్లర వర్తకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ పూర్ణా మార్కెట్‌లో తొలగించిన చిల్లర వర్తకులకు న్యాయం చేయాలని సిఐటియు జగదాంబ జోన్ కమిటీ డిమాండ్‌చేసింది. చిల్లర వర్తకులను తొలగించిన కారణంగా గత నెల రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా, ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసినప్పటికీ న్యాయం జరగకపోవడంతో సోమవారం పూర్ణా మార్కెట్ నుంచి తాము వ్యాపారం చేసుకునే జంగిడీలు, కాయగూరలను పట్టుకుని పోలీస్ కమిషనర్ ఆఫీస్ వరకు చిరు వ్యాపారులు ర్యాలీ నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పూర్ణా మార్కెట్‌ను నమ్ముకుని బతుకుతున్న చిల్లర వర్తకులను అన్యాయంగా తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. పోలీస్ కమిషనర్ స్పందించి వీరికి న్యాయం జరిగేలా, శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, జివిఎంసి జోనల్ కమిషనర్, ఆ ప్రాంతం సిఐతో మాట్లాడి పూర్ణా మార్కెట్ వెలుపల వ్యాపారం చేసుకునే చిల్లర వర్తకులకు, పూర్ణా మార్కెట్ లోపల నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకున్న షాపులను ఖాళీ చేయించి ఇప్పించేలా చూస్తామని చెప్పారు. వ్యాపారం చేసుకోవడానికి వీలుగా చోటు చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, సత్య, శ్రీను, రాము, రూప, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు విజ్ఞప్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ నాయకత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం విజయవాడలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్, క్యాట్, జిల్లా కోర్టు ఆవరణలో గత 10 నెలలుగా మూతపడ్డ క్యాంటీన్ తెరవాలని, కొత్త కోర్టు బిల్డింగులలో ఎయిర్ కండిషన్ సదుపాయం ఏర్పాటుచేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ కార్యదర్శి నరేష్ కుమార్, ఉపాధ్యక్షులు ఇమంది శ్రీనివాసరావు, కోశాధికారి అశోక్ కుమార్ ఉన్నారు.

వేగంగా శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో రూ.30లక్షలతో శ్మశాన వాటిక నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్మశాన వాటికలో రెండు భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఎండకు, వానకు మృతుల బంధువులు సేదతీర్చుకునేందుకు ఒక భవనం, మరో భవనం మృతదేహాలను కట్టెలతో కాల్చేందుకు నిర్మించారు. అప్పట నుండి ఈ శ్మశాన వాటికను ఎవరూ పట్టించుకోకపోవడంతో సరైన రహదారి సౌకర్యం లేక ఇరువైపులా కుప్పలు పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. వర్షాలు పడితే బురదతో మరింత అధ్వాన్నంగా మారేది. ఈ సమస్యపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి గొలుగొండ జెడ్పీటీసీ మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ తీసుకువెళ్లగా, రూ.30లక్షలు నిధులు కేటాయించారు. దీంతో ప్రస్తుతం సుమారు 300 మీటర్లు సీసీ రోడ్లు ఇరువైపులా డ్రైనేజీతో పాటు ముఖద్వారం వద్ద భారీ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

చేపట్టిన రోడ్డు నిర్మాణం